సాక్షి
సంగారెడ్డి

శుక్రవారం । 23 । మే । 2025



వేసవి శిబిరం..

తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ నిర్వహిస్తున్న వేసవి శిబిరాలు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచుతున్నాయి. వివరాలు 8లో ▸



బావిలో పసికందు మృతదేహం

సిద్దిపేటజిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లిలోని ఓ బావిలో పసికందు మృతదేహం లభ్యమైంది. వివరాలు 8లో ▸



ఇదేం ప్రగతి!

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కూడా లేక కంది మండలం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచింది. వివరాలు 9లో ▸

ముఖ్యమంత్రి పర్యటన..

సమస్యల చిట్టా.. చూడండిట్టా

నేడు జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో ఆయన ఎదుట సమస్యల చిట్టా పరిష్కారం కోసం ఎదురుచూస్తోంది. పటాన్‌చెరు వరకు మెట్రో పొడిగింపు, సాగునీటి పథకాలైన సంగమేశ్వర, బసవేశ్వర పనులు వేగవంతం, చెరుకు రైతులకు ప్రోత్సాహకాలు, ఉద్యాన పంటల కోసం శీతలగిడ్డంగుల ఏర్పాటు, తండాలు, మారుమూల గ్రామాల్లో తాగునీటి సమస్యలు, ధాన్యం సేకరణ వేగవంతం, ఫార్మా విలేజ్‌ల ఏర్పాటు నిర్ణయం రద్దు వంటి డిమాండ్‌లపై సీఎం రేవంత్‌రెడ్డి పెదవి విప్పుతారేమోనని జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు (శుక్రవారం) సంగారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. జహీరాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొంటారు. సీఎం హోదాలో తొలిసారి జిల్లాకు వస్తున్న రేవంత్ రెడ్డిపై జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు. సీఎం రాక సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయగా, ఈ పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధమయ్యాయి.

మెట్రో రైలు పొడిగింపు



మెట్రో రైలును పటాన్‌చెరు వరకు పొడిగించాలనే డిమాండ్ చాలా ఏళ్లుగా ఉంది. ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతమైన పటాన్‌చెరు ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతోంది. మియాపూర్ వరకు ఉన్న మెట్రోను పటాన్‌చెరు వరకు పొడిగించాలనే ప్రతిపాదనలున్నాయి. అయితే ఈ దిశగా అడుగులు పడలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ పొడిగింపు ప్రకటన వచ్చినప్పటికీ...అడుగులు పడలేదు. ఈ ప్రభుత్వం కూడా పొడిగింపునకు నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఈ దిశగా అడుగులు పడకపోవడం గమనార్హం. కనీసం ప్రాథమిక సర్వే గానీ, డీపీఆర్ గానీ సిద్ధమైన దాఖలాల్లేవు. అలాగే ఈ మెట్రోను రానున్న రోజుల్లో సంగారెడ్డి వరకు పొడిగించాలనే డిమాండ్ కూడా ఉంది.

సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతలు



సంగారెడ్డి, మెదక్ జిల్లాలను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ సర్కారు హయాంలో సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు శ్రీకారం చుట్టారు. కానీ పనులు పెద్దగా ముందుకు సాగలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ రెండు ఎత్తిపోతల పథకాల ప్రాధాన్యత తగ్గింది. సింగూరు జలాశయం నుంచి రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా 20 టీఎంసీలను ఎత్తిపోసుకుని 3.84 లక్షల ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యంగా ఈ పథకాలను చేపట్టిన విషయం విదితమే. ఈ భారీ సాగునీటి పథకాల పనులు వేగవంతం చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనలు ఉండాలనే అభిప్రాయం అన్నదాతల్లో వ్యక్తమవుతోంది.

> **నేడు జహీరాబాద్‌కు రేవంత్‌రెడ్డి రాక**
> - సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల వేగవంతానికి చర్యలు అవసరం
> - నత్తనడకన ధాన్యం సేకరణ..
> - పటాన్‌చెరు వరకు మెట్రో పొడిగింపేదీ?
> - చెరుకు రైతులకూ భరోసా దక్కేనా?
> - ఫార్మా విలేజ్‌ను వ్యతిరేకిస్తున్న స్థానికులు
> - రేవంత్ పర్యటనపై కొండంత ఆశలు

చెరుకు రైతుల సమస్యలు



రాష్ట్రంలోనే చెరుకు అత్యధిక విస్తీర్ణంలో చెరుకు సాగు చేసేది సంగారెడ్డి జిల్లాలోనే. సుమారు 28 వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతోంది. ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహకాలు లేకపోవడంతో రైతులు ఈ పంట సాగుకు క్రమంగా స్వస్తి చెబుతున్నారు. దీంతో జిల్లాలో ఈ పంట విస్తీర్ణం ఏటా తగ్గుతూ వస్తోంది. చెరుకు విస్తీర్ణం పెంచేలా ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలనే డిమాండ్ ఉంది. సన్న వడ్లకు ఇస్తున్న మాదిరిగానే చెరుకు సాగుకు బోనస్ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. అలాగే చెరుకు ధర పెంచాలని, రాయితీపై చెరుకు హార్వెస్టింగ్ యంత్రాలను అందించాలని రైతులు కోరుతున్నారు. సీఎం ఈ దిశగా ప్రకటన చేస్తే మేలు జరుగుతుంది.

గోదాములు..శీతల గిడ్డంగులు

జహీరాబాద్ ప్రాంతంలో రైతులు వివిధ రకాల హార్టికల్చర్ పంటలు సాగు చేస్తుంటారు. ప్రధానంగా ఆలుగడ్డ, అల్లం, మామిడి, అరటి వంటి ఉద్యానవన పంటలతోపాటు, వాము, మిర్చి వంటి సుగంధ ద్రవ్యాల పంటలు కూడా ఎక్కువగా సాగవుతున్నాయి. సుమారు 15 వేల ఎకరాల్లో సాగయ్యే ఈ పంటల ఉత్పత్తులను నిల్వ చేసేందుకు సరైన నిల్వ సౌకర్యం లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. సీజనులో తక్కువ ధరకు ఉత్పత్తులను విక్రయించాల్సి వస్తోంది. ప్రభుత్వం శీతలగిడ్డంగులు ఏర్పాటు చేస్తే ఈ పంటలు సాగు చేసే రైతులకు మేలు జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తండాల్లో తాగునీటి సమస్య



జిల్లాలో మారుమూల గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంది. ప్రధానంగా నాగల్‌గిద్ద, కల్హేర్, కంగ్టి వంటి మండలాల్లో పదుల సంఖ్యల తండాలకు సరైన తాగునీటి సౌకర్యం లేదు. దీంతో ఈ తండాల వాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మిషన్‌భగీరథ తాగునీటి పథకాలు ఈ మారుమూల ప్రాంతాల తాగునీటి అవసరాలను తీర్చడం లేదు.

కేంద్రాల్లోనే ధాన్యం...

జిల్లాలో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతోంది. దీంతో అకాల వర్షాలతో ధాన్యం తడిసి పోయి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. వారాల తరబడి ధాన్యం తూకాలు కాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పడిగాపులు కాస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు. ఈ సీజనులో సుమారు 2.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ, ఇప్పటివరకు కనీసం 70 వేల మెట్రిక్ టన్నులు కూడా కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.



షెడ్యూల్ ఇలా..

జహీరాబాద్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జహీరాబాద్ పట్టణంలోని హెలిప్యాడ్ వద్దకు ఉదయం 11గంటలకు చేరుకుంటారు. 11.15 నుంచి 11.30 గంటల వరకు బసవేశ్వర విగ్రహావిష్కరణలో పాల్గొంటారు.11.40 నుంచి 11.50 గంటల వరకు మాచ్‌నూర్ వద్ద గల కేంద్రీయ విద్యాలయానికి ప్రారంభోత్సవం చేస్తారు. మధ్యాహ్నం 12.05 నుంచి 12.20 గంటల వరకు పట్టణంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. అనంతరం పస్తాపూర్‌లోని బహిరంగ సభలో పాల్గొంటారు. 01.35 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుని తిరుగు ప్రయాణం అవుతారు.

ఫార్మా విలేజ్‌లను వ్యతిరేకిస్తున్న స్థానికులు

ప్రభుత్వం న్యాల్‌కల్ మండలం డప్పూరులో ఫార్మా విలేజ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అయితే ఈ నిర్ణయాన్ని మూడు గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడ ఫార్మా కంపెనీలు పెడితే పచ్చని పొలాలు కలుషితమవుతాయని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డప్పూరు, మాడ్గి తదితర గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే పలుమారు నిరసన తెలిపిన ఈ గ్రామాల వాసులు అవసరమైతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి దామోదర. చిత్రంలో కలెక్టర్ క్రాంతి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి తదితరులు

ఏర్పాట్లు పూర్తి : మంత్రి దామోదర

జహీరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఈనెల 23న జహీరాబాద్‌లో పర్యటిస్తున్నందున అందుకు తగిన ఏర్పాట్లు పూర్తయ్యాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. మంత్రి దామోదర గురువారం జహీరాబాద్‌కు వచ్చిన సందర్భంగా సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెలిప్యాడ్ పనులు, ప్రజా వేదిక, సభా వేదిక, వీఐపీ, మీడియా గ్యాలరీ, వాహనాల పార్కింగ్ పనులు, రూట్ల వారీగా ఏర్పాటు చేసిన పార్కింగ్, ప్రణాళిక ప్రకారం పూర్తి చేసినట్లు తెలిపారు. గ్రీనరీ, స్టేజీ ఏర్పాట్లు, వేదిక అలంకరణ, పరిశుభ్రత, మిషన్ భగీరథ తాగునీరు, మూత్రశాలల ఏర్పాటు పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. సీఎం పర్యటన సందర్భంగా 1100 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ పరితోశ్ వెల్లడించారు.

వాటర్ ప్రూఫ్ వేదిక

గత పక్షం రోజులుగా క్రమం లేకుండా వర్షాలు కురుస్తుండటంతో సీఎం సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు గాను ప్రాంగణాన్ని వాటర్‌ప్రూఫ్‌తో కూడిన పైకప్పును నిర్మించారు. సభా వేదికతో పాటు ప్రజలు కూర్చునే ప్రాంగణాలు వర్షం వచ్చినా కురువకుండా ఉండేలా ఏర్పాట్లు చేశారు. సభకు సుమారు 30వేల మందిని సమీకరించాలనే లక్ష్యంతో ఏర్పాట్లు చేశారు.

నిమ్జ్ రహదారి, కేవీలకు ప్రారంభోత్సవం

సంగారెడ్డి జోన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు అవుతున్న నిమ్జ్ కోసం ఏర్పాటు చేసిన రహదారితోపాటు కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అందుకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు.

రూ.26కోట్లతో కేంద్రీయ విద్యాలయం

ఝరాసంగం మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామ శివారులో 10 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ.26 కోట్ల వ్యయంతో కేంద్రీయ విద్యాలయాన్ని నిర్మించారు. పాఠశాల ఆవరణలో ఆడుకునేందుకు గ్రౌండ్, రన్నింగ్ ట్రాక్, విద్యుద్దీపాలు, వివిధ రకాల ల్యాబ్‌లు, వాహనాల పార్కింగ్ తదితర సౌకర్యాలతో అన్ని హంగులతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భవనాన్ని నిర్మించారు. అదే విధంగా పాఠశాల సిబ్బంది నివాసం కోసం ప్రత్యేక గదులను నిర్మించారు. ముఖ్యమంత్రితోపాటు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరై నేడు ప్రారంభించనున్నారు.



మాచ్నూర్ గ్రామ శివారులోని కేంద్రీయ విద్యాలయం

పూర్తయిన నిమ్జ్ రహదారి

జహీరాబాద్ నియోజకవర్గంలో ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో సుమారు 12,635 ఎకరాల విస్తీర్ణంలో నిమ్జ్ ఏర్పాటవుతుంది. మౌలిక వసతుల్లో భాగంగా ప్రత్యేక రహదారిని ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే ముంబై–హైదరాబాద్ జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ నిమ్జ్ రహదారిని ఏర్పాటు చేశారు. జహీరాబాద్ పరిధిలోని హుగ్గెల్లి నుంచి ఝరాసంగం మండలం బర్దిపూర్ గ్రామం వరకు నాలుగు లైన్లతో రూ.100 కోట్ల వ్యయంతో రహదారిని పూర్తి చేశారు.

న్యూస్‌రీల్

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

సీఎం రేవంత్‌కు సీపీఎం లేఖ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లాలో కార్మికుల సమస్యలు, ప్రజానీకం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను త్వరగా పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సీపీఎం కోరింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా నాయకులు సీఎం రేవంత్‌రెడ్డికి గురువారం లేఖ రాశారు. జిల్లాలో వందలాది పరిశ్రమల్లో వేలమంది కార్మికులు పని చేస్తున్నారని వారికి కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, ఇతర చట్టపరమైన సౌకర్యాలు అమలు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పదేళ్లు గడుస్తున్నా కనీస వేతనాల జీవోలను సవరించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా, పట్టణీకరణ వేగంగా అభివృద్ధి జరుగుతోందని మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు మెట్రో ను పొడిగించాలని కోరారు. జహీరాబాద్ ప్రాంతంలోని నిమ్స్, ట్రిపుల్‌ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం, పునరావాసం కల్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంజీర నదిపైన ఎత్తిపోతల ప్రాజెక్టు ఏర్పాటు చేసి నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్, సంగారెడ్డికి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని కోరారు.

భూములు లాక్కోవద్దు

సీపీఎం కార్యదర్శి బి.రాంచందర్

జహీరాబాద్ టౌన్: నిమ్జ్ కోసం సారవంతమైన భూములను బలవంతంగా తీసుకోవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.రాంచందర్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక శ్రామిక్ భవనంలో గురువారం నిమ్జ్ భూబాధితులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిమ్జ్ ప్రాజెక్టు కోసం చేపడుతున్న భూసేకరణ పద్ధతి సరిగ్గాలేదన్నారు. మూడు పంటలు పండే సారవంతమైన భూములను ఇవ్వబోమని రైతులు చెబుతున్నా భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేస్తున్నారని ఆరోపించారు. సారవంతమైన భూముల్లో అన్ని రకాల పంటలు పండుతున్నాయని, పరిశ్రమల కోసం తీసుకోవడం సరికాదన్నారు. రూ.50 లక్షలు పలికే భూములకు రూ.15 లక్షలు ఇవ్వడం వల్ల రైతులు నష్టపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. 2013 చట్టం ప్రకారం మూడు రెట్లు చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో మామిడ్గి, గణేశ్‌పూర్, ఎల్గోయి, హద్నూర్, హుసెల్లి రైతులు పాల్గొన్నారు.

రబ్బర్ డ్యాం నిర్మాణం సాధ్యమే

> - మంజీరాపై డ్యాం నిర్మాణం గురించి రిటైర్డ్ సీఈ విఠల్‌రావు
> - ఎమ్మెల్యే సంజీవరెడ్డికి ప్రాజెక్టు అంచనాలు ప్రభుత్వానికి నివేదిస్తా: ఎమ్మెల్యే



నారాయణఖేడ్: మంజీరా నదిపై రబ్బర్‌డ్యాం నిర్మాణం పై ఎమ్మెల్యేకు వివరిస్తున్న అధికారులు

నారాయణఖేడ్: మంజీరా నదిపై రాయిపల్లి వంతెన వద్ద రబ్బర్‌డ్యాం నిర్మాణం సాధ్యపడుతుందని ఇరిగేషన్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ విఠల్‌రావు పేర్కొన్నారు. దీని నిర్మాణం వల్ల భారీగా నీటి నిల్వ సామర్థ్యం పెరిగి తాగునీటి పథకాలతోపాటు, సాగునీటికి ఉపయోగపడుతుందన్నారు. ఇరిగేషన్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ విఠల్‌రావు, హైడ్రో కన్‌స్ట్రక్ట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.శ్రీధర్‌రెడ్డి, ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ఎస్.ప్రకాశ్‌రెడ్డి, మనూరు మండల ఇరిగేషన్ ఏఈఈ విద్య గురువారం ఖేడ్ ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డి నివాసంలో భేటీ అయి మంజీరా నదిపై నూతన టెక్నాలజీతో నిర్మించనున్న రబ్బర్‌డ్యాం సాధ్యాసాధ్యాలపై వివరించారు. 10 నుంచి 12 ఎంసీల నీటినిల్వ కారణంగా పరిసర నియోజకవర్గాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయన్నారు. రబ్బర్‌డ్యాం 400 మీటర్ల పొడవు, 5 మీటర్ల ఎత్తువరకు నిర్మించుకునే అవకాశం ఉందని తెలిపారు. నీటి ఫ్లోను బట్టి డ్యాం ఎత్తు, తగ్గులు చేసుకునే వీలుందని చెప్పారు. డ్యాం వల్ల పూడిక నిండే సమస్య ఉండదని, కుడి, ఎడమ కాలువలను సైతం ఏర్పాటు చేసుకుని సాగునీటికి నీటిని మళ్లించుకునే వీలుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి కలగజేసుకుని పూర్తి అంశాలతో ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి తనకు అందజేస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. జిల్లా రైతులు, తాగునీటి అవసరాలు, భూగర్భజలాల పెంపు లక్ష్యంగా ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానని చెప్పారు. ఖేడ్ ప్రాంతంతోపాటు జిల్లాకు ప్రాజెక్టు అన్ని రకాలుగా ఉపయోగపడాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ ఎంపీపీ రమేశ్ చౌహాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యం

గురుకుల కళాశాలల ఎత్తివేతకు కుట్ర

కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఇంటర్ కళాశాలలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎత్తివేసే కుట్ర చేస్తోందని, అదే జరిగితే భారీ ఎత్తున ఉద్యమిస్తామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం హెచ్చరించారు. బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు సంబంధించిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో గురువారం జరిగిన కేవీపీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో మాణిక్యం పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని 11 జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఇంటర్మీడియెట్ కళాశాలలను ఎత్తివేతకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో రాయికోడ్ గురుకుల కళాశాలను, కొండాపూర్ బైపీసీ, జహీరాబాద్ ఎమ్మెల్సీ, సింగూర్‌లో ఒకేషనల్, హత్నూర ఫార్మా టెక్నాలజీ, బైపీసీ గ్రూపుల ఎత్తివేతకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కళాశాలలు కోర్సుల ఎత్తివేతను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకుని, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్, జిల్లా అధ్యక్షుడు శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింలు, జిల్లా నాయకులు ప్రవీణ్, జయరాం పాల్గొన్నారు.

అభివృద్ధిని గాలికొదిలేశారు

ఎంపీ సురేశ్ షెట్కార్ విమర్శ



మాట్లాడుతున్న ఎంపీ సురేశ్ షెట్కార్

జహీరాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా గాలికి వదిలేయడం వల్లే సమస్యలు పరిష్కారానికి నోచుకోలేక పోయాయని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ విమర్శించారు. జహీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీమంత్రి హరీశ్‌రావు జహీరాబాద్ వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్రీయ విద్యాలయాన్ని తాను ఎంపీగా ఉన్నప్పుడే మంజూరు చేయించుకుని వచ్చినట్లు పేర్కొన్నారు. నిమ్జ్ ప్రాజెక్టు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకుని వస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్లే విషయంలో పూర్తిగా విఫలం అయిందని విమర్శించారు. సంగమేశ్వర, బసవేశ్వర పథకాలకు నిధులు ఎక్కడ మంజూరు చేశారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీమంత్రి ఎ.చంద్రశేఖర్, సెట్విన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, ఐడీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తన్వీర్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అంజయ్య పాల్గొన్నారు.

గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యే లక్ష్యం

ఓయూ ఉపకులపతి ప్రొఫెసర్ మొలుగరం కుమార్

జోగిపేట(అందోల్): గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ మొలుగరం కుమార్ పేర్కొన్నారు. జోగిపేటలోని పీజీ కళాశాలను ఓయూ ప్రతినిధి బృందం గురువారం పరిశీలించింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోవర్ధన్, అధ్యాపక బృందం పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కళాశాలలోని అధ్యాపకులతో మాట్లాడి సమస్యలు, బోధన తదితర విషయాలను ఈ బృందం అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా వీసీ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో పీజీ కళాశాలకు స్థలాన్ని కేటాయించినా ఆ స్థలాన్ని వేరే నిర్మాణాలకు ఉపయోగిస్తున్నందున పీజీ కళాశాలకు స్థలం కేటాయింపు విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామన్నారు. వీసీ వెంట రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ నాయక్, డైరెక్టర్, జిల్లా పీజీ కళాశాలల ప్రొఫెసర్ రాజేంద్రనాయక్ ఉన్నారు.

మహిళలకు ఇం‘ధనం’

> - మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్‌లు
> - శిక్షణ తీసుకుని ఉపాధి పొందనున్న 16 మంది మహిళలు
> - త్వరలో ప్రారంభం కానున్న బంకు
> - ఏర్పాట్లను పూర్తి చేస్తున్న అధికారులు

సంగారెడ్డి టౌన్: గ్రామాలలోని మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి పథకం ప్రవేశపెట్టి వివిధ రంగాల్లో ఎంతోమంది మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలు స్వయం సమృద్ధి సాధించడంతోపాటు మరో పది మందికి ఉపాధి చూపించే దిశగా కార్యాచరణ రూపొందించింది. అందులోభాగంగా ఇప్పుడు మహిళా సంఘం సభ్యుల కోసం పెట్రోల్ బంకును ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కలెక్టర్, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలో ఈ పెట్రోల్ బంక్ ప్రారంభం కానుంది. కాగా పెట్రోల్ బంకు నిర్వహణ కోసం ఏడు రోజులపాటు ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వారు సంగారెడ్డిలోని మహిళా సమైక్య భవనంలో ప్రత్యేక శిక్షణను ఇచ్చి 16 మంది మహిళలను ఎంపిక చేశారు. శిక్షణలో భాగంగా మేనేజ్‌మెంట్, టైం మేనేజ్‌మెంట్, అకౌంట్స్, సిస్టమ్ ఆపరేటింగ్, డ్రెస్ కోడ్ వంటి వాటి పై ఆరు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించి ఏడవ రోజు వారిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి నేర్పించిన అంశాలను ఆచరణలో పెట్టించారు.

మహిళలు ఆదాయం పొందేందుకు...

గ్రామీణ ప్రాంతంలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలబడేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులను ప్రోత్సహించేందుకు పెట్రోల్ బంకును ఏర్పాటు చేస్తున్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ యాజమాన్యం పెట్రోల్ బంకును ఏర్పాటు చేసేందుకు సెర్ప్ సీఈఓ, కలెక్టర్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ యాజమాన్యం మధ్య ఒప్పందం కుదిరింది. 20 ఏళ్లపాటు ఇది అమలులో ఉంటుంది.

నెలకు రూ.80 వేల ఆదాయం

810 చదరపు మీటర్ల విస్తీర్ణంలో బంకును ఏర్పాటు చేస్తున్నారు. నెలకు 80 వేల చొప్పున జిల్లా సమాఖ్య సంఘానికి ఆదాయం రానుంది. అద్దెను మూడేళ్లకు ఒకసారి 10% చొప్పున పెంచనున్నారు. సంగారెడ్డి బైపాస్‌లో పెట్రోల్ బంకులు లేకపోవడంతో దీనికి మంచి ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి. బంకులో పూర్తిగా మహిళలు విధులు నిర్వహిస్తారు.



మహిళా సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించనున్న పెట్రోల్ బంక్

> **శిక్షణ పూర్తి చేశాం**
>
> జిల్లా సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులో పూర్తిగా మహిళా సంఘాలదే బాధ్యత ఉండటం మంచి నిర్ణయం. ఇప్పటికే శిక్షణను పూర్తి చేశాం.
>
> – జ్యోతి, సంగారెడ్డి మహిళా సమాఖ్య అధ్యక్షురాలు
>
> **మంచి అవకాశం**
>
> మహిళా సంఘం సభ్యులు ఉపాధి పొందేందుకు బంకును ఏర్పాటు చేస్తున్నాము. జిల్లా కలెక్టర్, జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ పర్యవేక్షణలో బంకును నడిపిస్తారు. పైలెట్ ప్రాజెక్టు కింద ప్రారంభించనున్నారు. పెట్రోల్ బంక్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.
>
> జంగారెడ్డి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

క్లుప్తంగా

పాఠశాలలకు నోటీసులు


నోటీసు అంటిస్తున్న సిబ్బంది

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, విద్యా శాఖ నిబంధనలు పాటించకుండా నడుస్తున్న ప్రైవేటు పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్లు మండల విద్యా శాఖ అధికారి రచ్చ కిష్టయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా నడుస్తున్న శ్రీ చైతన్య పాఠశాలతోపాటు ఇంటర్నేషనల్, సీబీఎస్సీ అనుమతి లేకుండానే ఉన్నట్లు ప్రచారం చేసుకుంటున్న ఓక్లే పాఠశాలకు నోటీసులు జారీ చేశామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తి స్థాయిలో తెలుసుకొని పిల్లలను చేర్పించాలని సూచించారు.

పాఠశాల దశనే విద్యార్థి జీవితంలో కీలకం

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి


సూచనలు చేస్తున్న డీఈఓ శ్రీనివాస్ రెడ్డి

దౌల్తాబాద్ (దుబ్బాక): విద్యార్థి జీవితంలో పాఠశాల దశనే అత్యంత కీలకమని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాయపోల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదు రోజులు వృత్యంతర ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమానికి సంబంధించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయులు అందరూ పాల్గొనడం సంతోషకరమని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాయపోల్ మండల విద్యాధికారి సత్య నారాయణ రెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పటాన్‌చెరు టౌన్: తాళం వేసిన ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రామేశ్వరంబండ గ్రామం వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన శారద ప్లాస్టిక్ వస్తువుల విక్రయం వ్యాపారం చేస్తోంది. 20న వ్యాపారం కోసం కూతురితో కలిసి బయటికి వెళ్లింది. మరుసటి రోజు సాయంత్రం ఇంటికొచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.5 వేల నగదు చోరీ గురైనట్లు గుర్తించారు. గురువారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గజ్వేల్‌రూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్ట్ చేసిన ఘటన గజ్వేల్ పట్టణంలో చోటు చేసుకుంది. గురువారం గజ్వేల్ సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో గల లక్ష్మీప్రసన్న కాలనీలోని ఓ ఇంట్లో కొందరు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. పోలీసులు ఘటనా స్థలంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 29,800 నగదుతోపాటు 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వేసవి శిబిరం.. విజ్ఞాన నైపుణ్యం

- పేద విద్యార్థులకు అండగా తెల్లాపూర్ నైబర్ హుడ్
- ఐదేళ్లుగా ఉచితంగా నిర్వహణ
- ఉత్సాహం చూపుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
- దాతలు సైతం సహకారం

తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ కావత్ విభాగం పేద విద్యార్థులకు అండగా నిలుస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఐదేళ్లుగా వేసవిలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తూ వారిలో నైపుణ్యాన్ని మరింత పెంచుతున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్‌లో నెల రోజులుగా కొనసాగుతున్న వేసవి శిబిరంపై ప్రత్యేక కథనం..

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)

తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీలోని సమస్యలను పరిష్కరించేందుకు తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ అసోసియేషన్ ద్వారా వారి సమస్యలను పరిష్కరించుకుంటూ సామాజిక సేవలో ముందుంటున్నారు. 2020 నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వేసవిలో పలు అంశాలపై ఉచితంగా శిక్షణను అందిస్తున్నారు. మొదట 40 మంది విద్యార్థులతో మొదలైన శిబిరంలో ప్రస్తుతం 100 మంది పైగా విద్యార్థులు పాల్గొంటున్నారు.


యోగా శిక్షణలో విద్యార్థులు


గణితం, ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తున్న నిర్వాహకులు

స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

కేవలం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే ఈ ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఆంగ్ల భాషలో నైపుణ్యం పెంచేందుకు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు, గణితశాస్త్రం, యోగా, నృత్యం, వ్యక్తిగత వికాసం, స్వయం రక్షణ, వంటలపై శిక్షణ అందిస్తున్నారు.

స్వచ్ఛందంగా వస్తున్న వలంటీర్లు

వేసవి శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు శిక్షణ అందించేందుకు గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు ముందుకొస్తున్నారు. వారితోపాటు స్థానిక ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. అలాగే శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు సహకారం అందిస్తున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, టీషర్ట్‌లను అందిస్తున్నారు. వారిని ఇంటి నుంచి తీసుకురావడానికి బస్సులను ఏర్పాటు చేస్తున్నారు.

ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తున్నా..



వేసవి శిబిరంలో నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్ తరగతుల్లో పాల్గొంటున్నాను. ఎంతో సులభంగా ఇంగ్లిష్ మాట్లాడే విధానంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీని వల్ల ఇంగ్లిష్‌పై మరింత పట్టు సాధిస్తున్నాను. ప్రతి రోజూ శిక్షణకు హాజరవుతున్నాను.

– భాగ్యలక్ష్మి, 7వ తరగతి

అర్థమయ్యేలా బోధన



తెల్లాపూర్ నైబర్ హుడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరం మాకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇందులో గణితశాస్త్రం, ఇంగ్లిష్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఏదైనా సందేహం వచ్చి అడిగిన వెంటనే మాకు అర్థమయ్యే విధంగా బోధిస్తున్నారు.

– జస్వంత్, జిల్లా పరిషత్ విద్యార్థి

మంచి స్పందన ఉంది



ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ప్రతీ సంవత్సరం ఉచితం వేసవి శిబిరాలను నిర్వహిస్తున్నాం. నైబర్ హుడ్ కవాత్ పేరిట పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నాం. నైబర్ హుడ్ సభ్యులు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

– కవిత, నైబర్ హుడ్ కవాత్ కన్వీనర్

దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు



వేసవి శిబిరాలకు సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు. శిబిరంలో శిక్షణ కోసం విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషం. దాతలు కూడా ముందుకొచ్చి విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు.

– ఈశ్వరగారి రమణ, తెల్లాపూర్ నైబర్ హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఎడ్యుకేషన్ హబ్‌గా నర్సాపూర్

ఓయూ వైస్ చాన్సలర్ కుమార్ మొగులారం



మాట్లాడుతున్న మొగులారం, పక్కన ఓయూ అధికారులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని తమ పీజీ కాలేజీని అభివృద్ధి చేసి నర్సాపూర్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొగులారం తెలిపారు. గురువారం నర్సాపూర్‌లోని ఓయూ పీజీ కాలేజీని సందర్శించి కాలేజీ భవనం, ల్యాబోరేటరీలు, తరగతి గదులు పరిశీలించారు. కాసేపు విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఆయా జిల్లాల్లో ఉన్న ఓయూ పీజీ కాలేజీలను పలువురు అధికారులతో సందర్శించి సదుపాయాలు, సమస్యలు తెలుసుకుంటున్నామని అందులో భాగంగా స్థానిక కాలేజీకి వచ్చినట్లు తెలిపారు. నర్సాపూర్ ఓయూ పీజీ కాలేజీకి ప్రభుత్వం 10 ఎకరాల భూమి కేటాయించిందని, మరో 10 ఎకరాలు కేటాయించేందుకు తాము సంబంధిత అధికారులతో ప్రయత్నాలు చేయనున్నట్లు చెప్పారు. కాలేజీకి సొంత భవనం లేక నిర్వహణ ఇబ్బందిగా ఉన్నట్లు తాను గుర్తించానన్నారు. భవనం నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన వెంట ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ నాయక్, జిల్లా పీజీ కాలేజీల డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేంద్రనాయక్, జిల్లా పీజీ కాలేజీల రిజిస్ట్రార్ నరేశ్ రెడ్డి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజశేఖర్ రెడ్డి, ఓయూ చీఫ్ వార్డెన్ శ్రీనివాస్‌రావు ఉన్నారు. కాగా కాలేజీలో కొనసాగుతున్న కోర్సులు, వసతులను స్థానిక కాలేజీ ప్రిన్సిపాల్ మహేశ్వర్ రెడ్డి, కాలేజీ ప్రొఫెసర్లు వైస్ చాన్సలర్ బృందానికి వివరించారు.

భాషా లక్ష్యాల సాధనకు శిక్షణ ఉపయుక్తం

రాష్ట్ర తెలుగు పరిశీలకులు భాను ప్రకాశ్


మాట్లాడుతున్న అవుసుల భాను ప్రకాశ్

మెదక్ కలెక్టరేట్: భాషా లక్ష్యాల సాధనకు, విద్యార్థుల అభ్యసనా నైపుణ్యాలను పెంచేందుకు వృత్యంతర శిక్షణ ఎంతో ఉపయుక్తమని రాష్ట్ర తెలుగు పరిశీలకులు అవుసుల భాను ప్రకాశ్ తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో జరుగుతున్న తెలుగు ఉపాధ్యాయుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమానికి గురువారం పరిశీలకులుగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులందరూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మారుతున్న కాలానుగుణంగా బోధనలో జరుగుతున్న మార్పులను స్వీకరించాలన్నారు. అంతేకాకుండా భాషా బోధనలో తెలుగు ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని, అందుకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన బోధన చేయాలని సూచించారు. విద్యార్థులలో సృజన పెంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కోర్స్ ఇన్‌చార్జి సుదర్శన మూర్తి, రిసోర్స్ పర్సన్‌లు చిన్న బక్కప్ప, జనార్దన్, సుమన్, సాయిరాం శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో పాడి ఆవులు మృత్యువాత

చేర్యాల(సిద్దిపేట): పాముకాటుతో రెండు పాడి ఆవులు మృతి చెందిన ఘటన మండలంలోని ఆకునూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సోంరెడ్డి యశ్వంత్ రెడ్డి అనే రైతు బుధవారం వ్యవసాయ బావి వద్ద ఆవులను కట్టేసి ఇంటికొచ్చాడు. గురువారం ఉదయం చూసేసరికి రెండు ఆవులు మృతి చెంది ఉన్నాయి. పరిసరాల్లో గమనిస్తే పాములు కనిపించినట్లు తెలిపారు. దీంతో పాము కాటుకు గురైనట్లు భావించారు. మృతి చెందిన ఒక్కో ఆవు విలువ రూ.1.30 లక్షలు ఉంటుందని తెలిపారు. వ్యవసాయ అధికారులు స్పందించి బాధిత రైతుకు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఖాతా నుంచి డబ్బులు కట్

హత్నూర (సంగారెడ్డి): పీఎం కిసాన్ యాప్ ద్వారా బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బులు పోయినట్లు ఓ బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. హత్నూర మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన ఎరుకల యాదగిరి బ్యాంకు ఖాతా ఉంచి 18న రూ.34 వేలు కట్ అయ్యాయి. తన ఖాతా ఉన్న దౌల్తాబాద్‌లోని ఇండియన్ బ్యాంక్‌కు వెళ్లి అడుగగా పీఎం కిసాన్ యాప్ ద్వారా కట్ అయ్యాయని బ్యాంక్ అధికారులు చెప్పారు. దీంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. సైబర్ నేరగాళ్లే ఈ పని చేయొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఓటీపీలు గానీ ఇతర యాప్‌ల ద్వారా లింకులు వస్తే షేర్ చేయొద్దని ఎస్ఐ శ్రీధర్ సూచించారు.

కష్టం నేల పాలు


బోల్తా పడిన లారీ

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఎం.జలాల్‌పూర్, మంగళపర్తి గ్రామాల మధ్యలో ప్రమాదభరితంగా ఉన్న మలుపు వద్ద గురువారం ప్రమాదం చోటు చేసుకుంది. మంగళపర్తి ఐకేపీ కొనుగోలు కేంద్రం నుంచి వెల్దుర్తి వైపు వడ్ల లోడ్‌తో వస్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న వడ్ల సంచులు నేలపై పడిపోయాయి. లారీ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

దిగబడిన ధాన్యం లారీ

సిద్దిపేటఅర్బన్: బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి మిట్టపల్లిలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం లారీ బురదలో దిగబడింది. గురువారం పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ చొరవతో క్రేన్ సాయంతో లారీని బయటకు లాగారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన బిహార్ సర్పంచ్‌లు

గూడెంగడ్డ, నారాయణపూర్ గ్రామాలు సందర్శన


నారాయణపూర్‌లో బిహార్ సర్పంచ్‌ల బృందం

నర్సాపూర్ రూరల్: బిహార్‌కు చెందిన 80 మంది సర్పంచ్‌లు రెండు బృందాలుగా ఏర్పడి నర్సాపూర్ మండలం గూడెంగడ్డ, నారాయణపూర్ గ్రామ పంచాయతీలను గురువారం సందర్శించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ (ఎన్ఐఆర్‌డీ) ఆధ్వర్యంలో రాష్ట్రంలోని గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులను అధ్యయనం చేసేందుకు బిహార్ సర్పంచ్‌లను ఇక్కడికి పంపినట్లు అధికారులు తెలిపారు. డంప్‌యార్డు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, మిషన్ భగీరథ నీటి సరఫరా, ఇంకుడు గుంతలు, తడి పొడి చెత్త వేరు చేయడం, ఉపాధి హామీ పనులు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ వంటి వాటిని పరిశీలించారు. వారి వెంట ఎన్ఐఆర్‌డీ ప్రొఫెసర్లు అరుణ, ఆశలత ఉన్నారు. గూడెంగడ్డకు వచ్చిన బృందానికి నర్సాపూర్ ఎంపీడీఓ మధులత, నారాయణపూర్ బృందానికి ఎంపీఓ వైద్య శ్రీనివాస్ అభివృద్ధి పనులను వివరించారు. ఇక్కడ జరిగిన అభివృద్ధిని మా వద్ద నిర్వహించేందుకు కృషి చేస్తామని సర్పంచ్‌లు తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సాయిబాబా, ఐకేపీ ఏపీఎం గౌరీ శంకర్, గ్రామ కార్యదర్శులు నగేశ్, మల్లేశం, వంశీ కృష్ణ, లక్ష్మణ్ ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.




చందాపూర్ గ్రామంలో గోడలపై రాసిన అక్షరాలను చదువుతున్న పిల్లలు

గోడలపై అక్షరాలు.. మర్చిపోవద్దు పిల్లలు

- చందాపూర్ గ్రామంలో వాల్ రైటింగ్స్
- విద్యార్థులు చదివింది వేసవిలో మర్చిపోవద్దని ఓ ప్రధానోపాధ్యాయుడి వినూత్న ఆలోచన


పరమేశ్వర్‌రెడ్డి, హెచ్ఎం

చిన్నశంకరంపేట(మెదక్): వేసవిలో ఆట విడుపుతో విద్యార్థులు చదివిందంతా మర్చిపోతుంటారు.. అలా చదివిన చదువును మర్చిపోవద్దని వినూత్నంగా ఆలోచించాడు చందాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్‌రెడ్డి. తాను చదువు చెప్పే చిన్నశంకరంపేట మండలం చందాపూర్ గ్రామంలోని పలు గోడలపై తెలుగు, ఆంగ్లం అక్షరాలు, వర్ణమాల, అంకెలు, ఎక్కాలు, గణితం వంటి వాటిని రాయించాడు. గ్రామంలో చిన్నారులు ఆడుకునే చోట, కిరాణ దుకాణాల వద్ద, ప్రధాన కూడళ్ల వద్ద రాయడంతో విద్యార్థులు సైతం గోడలపై రాతలను ఆసక్తిగా చదవడం కనిపించింది. పెద్దలు సైతం చిన్నారులతో చదివిస్తున్నారు. వేసవిలో ఆటలపై దృష్టి పెట్టే పిల్లలు చాలా వరకు అక్షరాభ్యాసనం (బెసిక్స్) మర్చిపోతుంటారు. పాఠశాల తిరిగి ప్రారంభించాక ఒక నెలంత రివిజన్స్‌కు పోతుంది. ఇలా కావొద్దని గోడలపై రాయించినట్లు చెప్పుకొచ్చారు.

కొండపోచమ్మ వద్ద ఉజ్బెకిస్తాన్ అధికారులు


సాగర్ వద్ద ఫొటో దిగుతున్న ఉజ్బెకిస్తాన్ అధికారులు

మర్కూక్(గజ్వేల్): మర్కూక్ మండల కేంద్రంలో గల కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టును గురువారం ఉజ్బెకిస్తాన్ ఉన్నతాధికారుల బృందం సందర్శించారు. కొండపోచమ్మ నిర్మాణం, నీటి సామర్థ్యం, ప్రాజెక్టు నిర్మాణ ప్రక్రియ గురించి సమగ్రంగా కార్య నిర్వాహక ఇంజనీర్ రఘునాథ్ ప్రసాద్ అధికారుల బృందానికి వివరించారు. నిర్మాణంలో వినియోగించిన ఆధునిక సాంకేతికత, పనుల అమలు విధానం, ఎదురైన విధానాల గురించి ఉజ్బెకిస్తాన్ ఉన్నతాధికారులకు స్పష్టంగా వివరించారు. రిజర్వాయర్ నిర్మాణ లక్షణాలు, భూసేకరణ, భూగర్భజలాలు పెంపకం, ప్రాంతీయ ప్రయోజనాలపై అడిగి తెలుసుకున్నారు. అలాగే పంపింగ్, కట్టపై అధికారుల బృందం ప్రత్యేకంగా ఫొటోలు దిగారు. ఈ సందర్శన భారతదేశ సాగునీటి రంగంలో జరిగిన పురోగతిని గ్లోబల్ స్థాయిలో ప్రదర్శించే మంచి అవకాశంగా నిలిచిందని ఉజ్బెకిస్తాన్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈఈ మోతియా, ఏఈఈ ప్రశాంత్, సాయి కుమార్‌రెడ్డి, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సందర్శన

ములుగు(గజ్వేల్): మండలంలోని మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీని గురువారం ఉజ్బెకిస్తాన్ దేశానికి చెందిన ఉన్నతాధికారుల బృందం సందర్శించారు. డాక్టర్.రేశ్మినాయర్ ఆధ్వర్యంలో పర్యటించిన అధికారుల బృందం ముందుగా కాలనీలో నిర్మాణమైన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. నిర్వాసితులతో మాట్లాడి ప్యాకేజీలు విషయమై అడుగగా తహసీల్దార్ ఆరీఫా బృందానికి వివరించారు. అదే విధంగా కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలను, సమీపంలో నిర్మాణమైన పరిశ్రమలను పరిశీలించారు.

శుభకార్యానికి వెళ్లొస్తుండగా యువకుడు మృతి

- మరో యువకుడికి గాయాలు
- డీసీఎంను ఢీకొని బైక్ బోల్తా


మహేశ్(ఫైల్)

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని వడియారం గ్రామ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన పిట్ల మహేశ్(21), కాగుల మధు మాసాయిపేటలోని ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి బైక్‌పై చేగుంట వైపునకు వస్తున్నారు. వడియారం శివారులోకి రాగానే బైక్ ముందు వెళ్తున్న డీసీఎం డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో బైక్ డీసీఎంను ఢీకొని యువకులు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందగా, మధుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పట్టణ సీఐ రమేశ్ కథనం మేరకు.. సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ప్రధాన గేటు వద్ద గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గల దుకాణాల్లో భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 ఏళ్ల వరకు ఉంటుందని తెలిపారు. సెక్యూరిటీ గార్డ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎవరైనా గుర్తిస్తే 87126 56718 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

జహీరాబాద్‌లో మరో వ్యక్తి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ బైపాస్ రోడ్డులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు టౌన్ ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారన్నారు. మృతుడి వయసు సుమారు 35 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రి మార్చురీ రూమ్‌లో భద్రపరిచినట్లు చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బావిలో పసికందు మృతదేహం

అప్పనపల్లిలో దారుణం

- తల్లి ఒడిలోంచి దుండుగులు కిడ్నాప్ చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు
- కన్న తల్లిపైనే అనుమానం?


రెండు నెలల పసికందు

దుబ్బాక: సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లిలో దారుణం జరిగింది. రెండు నెలల పసికందును తల్లి ఒడిలోంచి దుండగులు అపహరించారంటూ పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేయడం.. మృతదేహం గురువారం సాయంత్రం బావిలో లభ్యం కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ దారుణ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరుకు చెందిన రామగల్ల శ్రీమాన్, నంగునూరు మండలం నర్మెటకు చెందిన కవిత మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి రెండు నెలల క్రితమే కొడుకు పుట్టాడు. ఈక్రమంలో కొన్ని రోజులుగా వీరు అప్పనపల్లిలో శ్రీమాన్ అమ్మమ్మ గ్యార ఎల్లవ్వ ఇంట్లో నివాసం ఉంటున్నారు. డెకరేషన్ పనులు చేస్తున్న శ్రీమాన్ ఈ నెల 17న పని నిమిత్తం తన అక్క ఊరు రుద్రారం వెళ్లాడు. ఈక్రమంలో సాయంత్రం వేళ ఇంటి ఆరుబయట తన కొడుకును ఎత్తుకొని నిలబడిన కవిత వద్దకు ముసుగు వేసుకున్న ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమెతో మాటలు కలిపారు. 'మీరు శ్రీమాన్ భార్యనా అని, మీరు మాకు తెలుసు' అంటూ ఆమె ఒడిలోంచి 2 నెలల పసికందును బలవంతంగా లాక్కొని బైక్‌పై పరారయ్యారు. దీంతో ఒక్కసారిగా నిశ్చేష్టురాలైన కవిత గట్టిగా కేకలు పెట్టింది. ఈ విషయం భర్తకు వెంటనే సమాచారం అందించింది. దీంతో బుధవారం రాత్రి భర్త శ్రీమాన్‌తో కలిసి దుబ్బాక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు.


పసికందు మృతదేహంతో రోదిస్తున్న బంధువులు


బావిలోంచి క్రేన్ సాయంతో మృతదేహాన్ని వెలికితీస్తున్న పోలీసులు, ఫైర్‌సిబ్బంది

తల్లి సమాచారంతోనే వెలికితీత..

పసికందును బావిలో పడేసి హత్యచేసిన ఘటన పలు అనుమానాలకు తావిస్తోంది. బుధవారం రాత్రి తన కొడుకును దుండగులు అపహరించారంటూ ఫిర్యాదు చేయడం.. ఆ క్రమంలోనే తల్లి కవితను పోలీసులు ప్రత్యేకంగా విచారించడంతో విస్తుగొలిపే నిజాలు బయటకు వచ్చినట్లు విశ్వసనీయంగా తెలిసింది. విచారణలో ఆమె ఇచ్చిన సమాచారం మేరకే దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఫైర్ సిబ్బంది గురువారం అప్పనపల్లిలోని పెద్ద బావిలో 4 గంటలకు పైగా గాలించి ఎట్టకేలకు ఆ పసికందు మృతదేహాన్ని వెలికితీసినట్లు తెలిసింది. కవితనే ఈ దారుణంకు పాల్పడిందా? లేదా ఎవరైనా ఉన్నారా? అనే విషయంపై విచారిస్తున్నట్లు తెలిసింది.